గురువారం ఉష్ణోగ్రత | గరిష్ఠం : 42.1°C | కనిష్ఠం : 24.0°C



రంజాన్ వేళలు

ఇఫ్తార్ : శుక్రవారం సా : 6.35 గం..

సహర్ : శనివారం ఉ : 4.44 గం..

రద్దీగా లేని మానుకోట జిల్లా కేంద్రంలోని నర్సంపేట బైపాస్ రోడ్డు



భగభగ..

రారెత్తిస్తున్న ఎండలతో జనం ఉక్కిరిబిక్కిరి

- ఉమ్మడి జిల్లాలో 40 డిగ్రీలు దాటిన ఉష్ణోగ్రత
- ములుగు, మహబూబాబాద్ జిల్లాలో అత్యధికం
- బొగ్గుగని ప్రాంతాల్లో మరింత వేడిమి
- ఆరెంజ్ అలర్ట్ జారీతో యంత్రాంగాలు అప్రమత్తం

హనుమకొండ, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : ఎండలు భగభగమంటున్నాయి. రోజురోజుకు ఉష్ణోగ్రతలు పెరుగుతుండటం, సగటున 40డిగ్రీలకు పైనే నమోదవుతుండటం, వడగాలులు, ఉక్కపోత ప్రారంభం కావడంతో జనం ఉక్కిరిబిక్కిరవుతున్నారు. ఉదయం 9 గంటలకే సూరీడు సుర్రుమంటుండగా.. మధ్యాహ్నం సమయంలో జనం ఇళ్ల నుంచి బయటకు వచ్చేందుకు జంకుతున్నారు. దీంతో రహదారులు నిర్మానుష్యంగా కనిపిస్తున్నాయి. నిత్యం రద్దీగా ఉండే కూడళ్లు వెలవెలబోతున్నాయి. గతేడాది కన్నా ఈ సారి ఎండలు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. మార్చిలో పగటి ఉష్ణోగ్రతలు 30 నుంచి 38 డిగ్రీలు నమోదవగా.. ఏప్రిల్‌లో తీవ్రత పెరుగుతూ వస్తోంది. గురువారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో అత్యధిక ప్రగటి ఉష్ణోగ్రత 42 డిగ్రీలకు చేరుకుంది. అత్యధికంగా ములుగు, మహబూబాబాద్ జిల్లాల్లో గరిష్ఠ ఉష్ణోగ్రత 42.1 డిగ్రీలు నమోదైంది. జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 41డిగ్రీలు, జనగామ జిల్లాలో 40.5డిగ్రీలు, వరంగల్ జిల్లాలో 40.3 డిగ్రీలు, హనుమకొండ జిల్లాలో కాస్త తక్కువగా 39.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రానున్న రెండు రోజుల్లో ములుగులో మరింతగా 42.9 డిగ్రీలు, 42.3 డిగ్రీలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో 42.6 డిగ్రీలు, జనగామలో 41.6 డిగ్రీలు, వరంగల్‌లో 41.7 డిగ్రీలు, హనుమకొండలో 41.5 డిగ్రీలకు పెరగొచ్చని వాతావరణ కేంద్రం తెలిపింది. ఎండలు పెరుగుతుండటంతో జన సంచారం లేక రోడ్ల పక్కన చిరువ్యాపారాలు మందగించాయి. దీంతో ఆ పేద, చిరు వ్యాపారులు ఆవేదన చెందుతున్నారు. ఈ క్రమంలోనే పండ్లు, పండ్ల రసాలు, కొబ్బరి బొండాలు, మజ్జిగ, అంబలి, సోడ తదితర పానీయాలకు డిమాండ్ పెరిగింది. మరోవైపు వడదెబ్బబారిన పడుతున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతోంది. ముఖ్యంగా బయట పనులకు వెళ్లే కార్మికులు, ఉపాధి కూలీలు ఎక్కువగా అనారోగ్యం పాలవుతున్నారు. ఉష్ణోగ్రతల తీవ్రత వల్ల వృద్ధులు, పిల్లలు, దీర్ఘకాలిక వ్యాధులతో బాధడుతున్నవారు అస్వస్థతకు గురవుతున్నారు. ఈ క్రమంలో అన్ని జిల్లాల వైద్య ఆరోగ్య శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. వేసవి కాలంలో వచ్చే వ్యాధులపై పర్యవేక్షణకు జిల్లా స్థాయిలో, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల స్థాయిలో ర్యాపిడ్ రెస్పాన్స్ టీమ్‌లను ఏర్పాటు చేసి ఎండబాధితులకు తక్షణ వైద్యసేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. ఉచితంగా ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచారు.

నిప్పుల కుంపటిగా బొగ్గుగనులు..

జయశంకర్ భూపాలపల్లి జిల్లా పరిధిలోని బొగ్గుగని ప్రాంతాలైన భూపాలపల్లి టౌన్, తాడిచెర్ల, ఘనపురం మండలంలోని మాధవరావుపల్లె ఓపెన్ కాస్ట్‌లు, వాటి పరిసరాలు నిప్పుల కుంపటిని తలపిస్తున్నాయి. సహజంగా బొగ్గునిల్వలు, ఓపెన్‌కాస్ట్‌లు ఉన్న చోట వేడిమి ఎక్కువగా ఉంటుంది. దీనికితోడు ఎండలు మండిపోతుండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉష్ణోగ్రతలు ఇలాగే పెరుగుతూ పోతే నీటితో ఈ ప్రాంతాలను చల్లబరచాల్సి ఉంటుంది. అలాగే సిబ్బందికి సెలవులు ప్రకటించాల్సిన పరిస్థితి వస్తుంది. ఉద్యోగులకు మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాల్సి ఉంటుంది. బయట 40 డిగ్రీలు ఉంటే ఓపెన్ క్యాస్ట్‌లలో 45 డిగ్రీలకుపైనే ఉష్ణోగ్రత ఉండే అవకాశం ఉండటంతో సంస్థ అధికారులను అప్రమత్తం చేస్తోంది.



సోడా దుకాణం వద్ద రద్దీ

క్యాంపు ఆఫీసులో ఎమ్మెల్యే ప్రత్యేక పూజలు




ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే భూక్య మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 4: : మహబూబాబాద్ పట్టణంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గురువారం శాసన సభ్యులు భూక్యమురళీనాయక్-ఉమా దంపతులు ప్రత్యేక పూజలు చేశారు. తెలంగాణ రాష్ట్రంలో నియోజకవర్గ కేంద్రాల్లో ఎమ్మెల్యేలు ప్రజలకు అందుబాటులో ఉండాలని ప్రభుత్వం క్యాంపు ఆఫీసులు నిర్మించిన విషయం విధితమే. ఎమ్మెల్యేగా మురళీనాయక్ గెలిచిన తర్వాత ఇంతకాలం మంచి ముహుర్తాలు లేక పోవడంతో క్యాంపు ఆఫీసు లోకి వెళ్లలేదు. గురువారం మంచి ముహూర్తం ఉండడంతో ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో కుటుంబ సభ్యులతో కలిసి పాలు పొంగించి అందులోకి వెళ్లారు. వేదపండితుల మంత్రోచ్చరణల నడుమ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఫాస్టర్లు, ముస్లిం మతపెద్దలు ప్రార్థనలు చేసి ఎమ్మెల్యేను ఆశీర్వదించారు. అనంతరం ఎమ్మెల్యే మురళీ నాయక్‌కు కాంగ్రెస్ నాయకులు పుష్ప గుచ్ఛాలందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఘంట సంజీవరెడ్డి, బండారు వెంకన్న, బట్టు శ్రీను, అల్లం నాగేశ్వర్‌రావు, ఖలీల్‌పాషా, చలమల నారా యణ, కోడి శ్రీను, పోతు రాజు, నాళ్ల లక్ష్మి నర్సింహా రావు, భూక్య శ్రీను, అంబటి మహేందర్‌రెడ్డి, దేవుడు, గుంజె హన్మంతు, రమేష్‌నాయక్, నిమ్మల శ్రీనివాస్, యాకయ్య పాల్గొన్నారు.

కూలితేనే... పట్టించుకుంటారా?

- నిజాంకాలం నాటి భవనంలో నిర్వహణ
- ఎప్పుడు పడిపోతుందోనని భయాందోళన
- పార్కింగ్ స్థలం లేక వాహనదారుల అవస్థలు
- స్థలం లేక స్కూల్ బిల్డింగ్‌లో పాస్‌పోర్టు ఆఫీసు నిర్వహణ

మానుకోట హెడ్ పోస్టాఫీస్ భవనానికి 110 ఏళ్లు





మహబూబాబాద్‌లో 110 సంవత్సరాల క్రితం నిర్మించిన హెడ్ పోస్టాఫీస్ భవనం

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 4 : జిల్లా కేంద్రంలోని హెడ్‌పోస్టాఫీస్ సేవలు ప్రారంభమై 110 ఏళ్లవుతోంది. నిజాం కాలంనాటి భవనంలోనే ఇంకా కొనసాగుతోంది. తెలంగాణ ఏర్పడి, జిల్లా కేంద్రంగా ఆవిష్కృతమైనప్పటికి మానుకోటలో మాత్రం పోస్టాఫీస్ భవనం రూపురేఖలు మారలేదు. శిథిలావస్థకు చేరుకున్న భవనంలోనే పోస్టాఫీసు ఖాతాదారులకు సేవలందుతున్నాయి. నిజాం కాలంలో 1914 సంవత్సరంలో మానుకోట పాతబజారులోని రైల్వేస్టేషన్ సమీపంలో నిర్మించిన భవనంలో పోస్టాఫీసు సేవలు ప్రారంభమయ్యాయి. ఆ నాటి నుంచి నేటి వరకు హెడ్ పోస్టాఫీస్ అందులోనే కొనసాగుతోంది. హెడ్ పోస్టాఫీస్‌లో ఖాతాదారులకు బ్యాకింగ్, పోస్టల్ సేవల ందుతున్నాయి. గతంలో ఒక్కపోస్టల్ శాఖకు సంబంధించిన సేవలు మాత్రమే ఉండేవి. క్రమక్రమంగా ఖాతాదారులకు మరింత సేవలందించేందుకు పోస్టల్ శాఖ దేశ వ్యాప్తంగా ఇండియన్ పోస్టు పేమెంట్ బ్యాంకు (ఐపీపీబీ)ను ప్రారంభించారు. దీంతో బ్యాంకు తరహాలోనే పోస్టల్‌శాఖలో ఖాతాదారులకు సేవలందిస్తున్నారు. దీంతో రోజు వారీగా హెడ్‌పోస్టాఫీస్‌కు వచ్చే ఖాతాదారుల సంఖ్య గణనీయంగా పెరిగింది. పనుల నిమిత్తం పెద్ద సంఖ్యలో పోస్టాఫీసుకు వస్తే కూర్చోవడానికి కూడ స్థలం సరిపడా లేదు. 110 ఏళ్ల దాటిన భవనం ఎప్పుడు కూలుతుందోనని ఖాతాదారులు భయంగా భయంగా పనుల నిమిత్తం పోస్టాఫీసుకు వెళ్తున్నారు. గతంలో ఆ భవనం కురుస్తుండగా తాత్కాలికంగా మరమ్మత్తులు చేసి పోస్టాఫీస్‌ను నిర్వహిస్తున్నారు.

పార్కింగ్ స్థలం లేక వాహనదారుల ఇక్కట్లు...

పట్టణంలోని హెడ్‌పోస్టాఫీస్ వద్ద పార్కింగ్ స్థలం లేక పోవడంతో అక్కడకు వచ్చే వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దినదినాభివృద్ధి చెంది జిల్లా కేంద్రంగా ఎదిగిన మానుకోటలో ప్రధాన రహదారుల్లో సెంట్రల్ డివైడర్లు నిర్మించారు. ఆక్రమంలోనే రైల్వే స్టేషన్ నుంచి బస్టాండ్‌కు వెళ్లే మార్గంలో సెంట్రల్ డివైడర్లు నిర్మించడం, రైల్వే స్టేషన్‌కు సమీపంలో ప్రధాన రహదారిపక్కనే పోస్టాఫీస్ ఉండడంతో అక్కడ వాహనాలు నిలిపితే ఆ మార్గంలో పెద్ద వాహ నాలు వెళ్లలేని ధైన్యస్థితి. దీంతో ఆ రహదారిలో ట్రాఫిక్ సమస్యలు కూడ తలెత్తుతున్నాయి. దీనికి తోడు అక్కడ వాహనాలు నిలిపితే వాటికి పెనాల్టీలు పడుతున్నాయి.. వాహనాన్ని నిలిపి పోస్టాఫీసుకు వెళ్లి వచ్చే సరికి వాహనదారుడు ఫోన్‌కు పెనాల్టీ మెసేజ్ రావడంతో ఆందోళనకు గురవుతున్నారు.

స్కూల్ బిల్డింగ్‌లో పాస్‌పోర్టు కేంద్రం..

పోస్టాఫీస్ ఆవరణలోనే ఉండాల్సిన పాస్‌పోర్టు కేంద్రం ప్రభుత్వ స్కూల్‌లోని ఓ గదిలో నిర్వహిస్తున్నారు. గతంలో పాస్‌పోర్టు కోసం రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు వెళ్లాల్సి వచ్చేది. గత ఐదేళ్ల క్రితం మహబూబాబాద్ పార్లమెంటీ కేంద్రంలో పాస్‌పోర్టు మంజూరు కావడంతో పోస్టాఫీస్‌లో స్థలం లేక పక్కన ఉన్న పాఠశాలలోని ఓ గదిలో ఏర్పాటు చేశారు. పాస్‌పోర్టు పొందేందుకు ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి ఈ కేంద్రానికి వస్తుంటారు. ఒక్క గదిలో నిర్వహించడం, అక్కడ కూడ పార్కింగ్ స్థలం లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.



పోస్టాఫీస్‌కు నూతన భవనాన్ని నిర్మించాలి

బోనగిరి రవీంద్రగుప్తా, సీనియర్ సిటిజన్, మానుకోట

మహబూబాబాద్ పట్టణంలో హెడ్ పోస్టాఫీస్‌కు నూతన భవనాన్ని నిర్మించాలి. నిజాం కాలం నాటి శిధిలావస్థకు చేరుకున్న భవనంలో పోస్టాఫీస్ నిర్వహణ జరుగుతుంది. తాత్కాలిక మరమ్మతు చేస్తూ నిర్వహిస్తున్నారు. అన్ని హంగులతో నూతన భవనాన్ని నిర్మించాలి. అదే విధంగా ఈ ప్రాంత ప్రజలకు అందుబాటులోకి వచ్చిన పాస్‌పోర్టు కేంద్రానికి కూడ నూతన భవనం నిర్మించాలి.

రాజ్యసభ ఎంపీగా వద్దిరాజు ప్రమాణస్వీకారం



పార్లమెంట్ ప్రాంగణంలో రాజ్యసభ ఎంపీగా ప్రమాణస్వీకారం చేస్తున్న వద్దిరాజు రవిచంద్ర

మహబూబాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రం నుంచి రెండోసారి రాజ్యసభ ఎంపీగా మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల కేంద్రానికి చెందిన వద్దిరాజు రవిచంద్ర ప్రమాణస్వీకారం చేశారు. న్యూఢిల్లీలోని పార్ల మెంట్ ప్రాంగణంలో గురువారం దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి నూతనంగా రాజ్యసభకు ఎన్నికైన ఎంపీలతో ఉప రాష్ట్రపతి జగదప్ దన్కర్ ప్రమాణస్వీకారం చేయించారు. అందులో భాగంగా తెలంగాణ రాష్ట్రం నుంచి బీఆర్ఎస్‌కు చెందిన వద్దిరాజు రవిచంద్రతో ఉపరాష్ట్రపతి ప్రమాణ స్వీకారం చేయించారు. గతంలో ఎంపీగా ఉన్న బండ ప్రకాశ్‌కు ఎమ్మెల్సీగా అవకాశం రావడంతో ఆయన స్థానంలో వద్దిరాజు రవిచంద్రకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ అవకాశం ఇవ్వడంతో రెండేళ్లు రాజ్యసభ ఎంపీగా పదవీలో కొనసాగా రు. ఇటీవలనే మరోమారు మాజీ సీఎం కేసీఆర్ వద్దిరాజు రవిచంద్రకు రాజ్యసభ ఎంపీగా అవకాశం ఇచ్చారు. ఆ క్రమంలో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికకాగా పార్లమెంట్ ప్రాంగణంలో వద్దిరాజు రవిచంద్ర ఎంపీగా ప్రమాణస్వీకారం చేశారు. అనంతరం ఉపరాష్ట్రపతి, రాజ్యసభ చైర్మన్ దన్కర్‌ను ఎంపీ రవిచంద్ర మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు.

ఓటింగ్ శాతం పెంపునకు.. స్వీప్ కార్యక్రమాలు



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు ప్రత్యేక స్వీప్ కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా కలెక్టర్, ఎన్నికల అధికారి అద్వైత్‌కుమార్‌సింగ్ అన్నారు. 85 ఏళ్ల పైబడిన, దివ్యాంగులు హోమ్ ఓటింగ్‌కు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం స్వీప్ కార్యక్రమా లపై సంబంధిత అధికారులతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ.. ఓటింగ్ శాతం పెంచేందుకు భారతఎన్నికలసంఘం సూచనల మేరకు స్వీప్ యాక్టివిటీస్ కమిటీ ద్వారా జిల్లాలోని ఇంటర్, డిగ్రీ, ఇంజనీరింగ్, పార్మసీ విద్యాసంస్థల్లో ప్రత్యేక ఓటరు అవగాహన కార్యక్రమాలు, సమావేశాలు, ర్యాలీలు నిర్వహి ంచాలన్నారు. ఓటింగ్ నమోదుశాతం తక్కు వగా ఉన్న ప్రాంతాలను గుర్తించి ఓటు వినియోగంపై అవగాహన కల్పించాలన్నారు. ప్రధాన కూడళ్లలో హోర్డింగ్‌లు, ఫ్లెక్సీలు, ప్రచార రథాలు, స్వయంసహాయక బృందాలచే సమావేశాలు, స్థానిక కళాకారులచే ప్రదర్శనలు నిర్వహించాలని ఆదేశించారు. అనంతరం దివ్యాంగులు, వయోవృద్ధులచే ప్రత్యేక సమావేశాన్ని ఏర్పాటు చేసి హోం ఓటింగ్ కోసం దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం. డేవిడ్, అధికారులు మరియన్న, ఎస్. శ్రీధర్,అన్వేష్, పవన్‌కుమార్, రాజేంద్రప్రసాద్, పురుషోత్తం, వరలక్ష్మి పాల్గొన్నారు.

సదరం పత్రాలకు స్లాట్ బుకింగ్ చేసుకోవాలి...

సదరం ధృవీకరణ పత్రాలకు అర్హులైన వారు ఈ నెల 5 నుంచి ఉదయం 11 గంటల నుంచి స్లాట్‌బుక్ చేసుకోవాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ ఒక ప్రకటనలో తెలిపారు. స్లాట్ బుక్ చేసుకున్న దివ్యాంగులకు వైకల్య పరీక్షలు ఏప్రిల్ 10, 24 తేదీల్లో నిర్వహి ంచడం జరుగుతుందన్నారు. ఈ నెల 10న రెనివల్స్‌కు, కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందడానికి 24న స్లాట్‌బుక్ చేసుకోవాలన్నారు. సదరం క్యాంపులో రెన్యువల్ కోసం 150, కొత్తగా సదరం సర్టిఫికెట్ పొందేందుకు 150 మొత్తంగా 300 స్లాట్లు అందుబాటులో ఉంటాయని తెలిపారు.

మార్కెట్‌కు ఐదు రోజులు సెలవులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 4 : మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌కు ఈ నెల 5 నుంచి 9 వరకు ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు మార్కెట్ కార్యదర్శి శంషీర్ గురువారం తెలిపారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రామ్ జయంతి, 6, 7న వారాంతపు సెలవులు. సోమవారం అమావాస్య, 9ను ఉగాది పండుగ సందర్భంగా సెలవులు ప్రకటించినట్లు తెలిపారు. రైతులు, వ్యాపారులు, గుమస్తాలు, దడువాయిలు, కూలీలు గమనించాలని కోరారు. మార్కెట్ తిరిగి ఈ నెల 10వ తేదీన బుధవారం మార్కెట్ పునఃప్రారంభమవుతుందని తెలిపారు.

- కేసముద్రం : కేసముద్రం వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ఉన్నాయని ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు గురువారం తెలిపారు. ఈ నెల 5న బాబు జగ్జీవన్‌రాం జయంతి, 6, 7 తేదీల్లో శని, ఆదివారాంతపు, 8న అమావాస్య, 9న ఉగాది పండుగ సందర్భంగా సెలవులు ఉన్నాయని, రైతులు ఈ విషయాన్ని గమనించి తిరిగి ఈ నెల 10న తమ సరుకులు మార్కెట్‌కు తీసుకురావాలని కోరారు.

గుండెపోటుతో సీనియర్ నేత రంగారెడ్డి మృతి





రామసహాయం రంగారెడ్డి మృతదేహానికి నివాళులర్పిస్తున్న ఎంపీ కవిత

మరిపెడ, ఏప్రిల్ 4 : మరిపెడ మండలం తానంచర్లకు చెందిన వ్యాపార దిగ్గజం, సీనియర్ రాజకీయనేత రామసహాయం రంగారెడ్డి (67) గురువారం గుండెపోటుతో చికిత్స పొందుతూ హైదరాబాద్‌లో మృతి చెందారు. ఈయన గత కొంతకాలంగా హైదరాబాద్‌లోనే స్థిర నివాసం ఏర్పర్చుకొని అక్కడే కుటుంబ సభ్యులతో ఉంటున్నారు. ఇది వరకు రంగారెడ్డికి రెండు మార్లు హార్ట్‌స్ట్రోక్ రాగా వైద్యులు శస్త్ర చికిత్సలు చేశారు. మళ్లీ గురువారం తెల్లవారుజామున గుండె నొప్పిగా ఉందని కుటుంబ సభ్యులకు తెలుపగా వారు ఆయనను వెంటనే హైదరాబాద్‌లోని ఓ కార్పొరేట్ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ రంగారెడ్డి మృతిచెందారు. ఈయన మృతి విషయం తెలిసి సొంత గ్రామమైన తానంచర్లలో తీవ్ర విషాదం అలుముకుంది. ఆయన మృతి వార్త తెలిసి పలువురు హైదరాబాద్‌కు తరలివెళ్లారు. అక్కడే మహాప్రస్థానంలో ఆయన అంత్యక్రియలు జరిగాయి. భార్య, కుమార్తె ఉన్నారు. మరిపెడ మండలం తానంచర్ల గ్రామానికి చెందిన రంగారెడ్డి అంచెలంచెలుగా వ్యాపార వేత్తగా ఎదిగారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలో సీనియర్ రాజకీయనేతగా గుర్తింపు పొందారు. 2004 సంవత్సరంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పీసీసీ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి చేపట్టిన పాదయాత్ర సందర్భంగా డోర్నకల్ నియోజకవర్గం కుమ్మరికుంట్ల దగ్గర కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి జై తెలంగాణ నినాదాలతో హోరెత్తించారు. రాజశేఖర్‌రెడ్డి ఆగ్రహించి ఆయనను కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెన్షన్ చేయడం అప్పట్లో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా రంగారెడ్డి సంచలనంగా మారారు. అనంతరం తెలంగాణ ఆకాంక్షకు తలొగ్గిన కాంగ్రెస్ పార్టీ జాతీయ హైకమాండ్ వెనువెంటనే ఆయనపై సస్పెన్షన్ ఎత్తివేసింది. రంగారెడ్డి మృతదేహాన్ని ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ మాజీ చైర్మన్ నవీన్, మాజీ ఓడీసీఎంఎస్ చైర్మన్ మహేందర్‌రెడ్డి, ఆర్.సత్యనారాయణరెడ్డి, గడ్డం వెంకన్న, రాంబాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు.

ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలి

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ నర్సిరెడ్డి



టీఎస్ యూటీఎఫ్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్సిరెడ్డి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు పెంచాలని ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అలుగుబెల్లి నర్సిరెడ్డి అన్నారు. మహబూబాబాద్‌లోని ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో గురువారం టీఎస్-యూటీఎఫ్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలలు-విద్యార్థుల నమోదు అనే అంశంపై వర్క్‌షాపు నిర్వహించారు. ప్రధాన వక్తగా హాజరైన ఎమ్మెల్సీ నర్సిరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల నమోదు తగ్గుతుందని, దీని వల్ల ప్రభుత్వ పాఠశాలలు ప్రమాదకరస్థితిలో ఉన్నాయన్నారు. జిల్లాలో ప్రభుత్వ పాఠశాలలు ఎక్కువ ఉండగా విద్యార్థుల సంఖ్య మాత్రం తక్కువ, ప్రైవేటు పాఠశాలలు తక్కువ ఉండగా వాటిల్లో మాత్రం విద్యార్థుల సంఖ్య ఎక్కువగా ఉందన్నారు. ప్రతి తరగతిలో కనీసం 15మంది విద్యార్థులు ఉండే విధంగా చూడాలన్నారు. పాఠశాలల్లో ప్రతి తరగతికి ఒక గది, ప్రతి తరగతి ఒక ఉపాధ్యాయుడు ఉండే విధంగా చూడాలన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్న సమస్యలు వెంటనే పరిష్కరించాలని ప్రభుత్వానికి సూచించారు. ఈ సమావేశంలో నాయకులు మల్లారెడ్డి, నర్సింహారావు, యాకూబ్, వెంకటేశ్వర్లు, స్వప్న, నాగమల్లయ్య, వెంకటేశ్వర్లు, మంజుల, హుస్సేన్, మంజుల, సంజీవ, శ్రీనివాస్, ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్, రమణయ్య, తిరుపతి, ఉపాధ్యాయులు శ్యామలరావు, కృష్ణమూర్తి, శ్రీనివాస్, హరినాయక్, సురేష్, ప్రసాద్, శైలజ, స్వాతి, రాంజీ, మైసయ్య, లాల్‌చంద్, భరత్, బాలరాజు, లక్ష్మణ్‌రావు, హోంజీ పాల్గొన్నారు.

గొర్రెల మందపైకి దూసుకుపోయిన కారు


ఎలుకుర్తి క్రాస్ వద్ద గొర్రెలపైకి కారు దూసుకుపోవడంతో మృతి చెందిన, గాయపడిన గొర్రెలు

ధర్మసాగర్ (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : అతివేగంతో కారు గొర్రెల మందపైకి దూసుకుపోవడంతో ఏడు గొర్రెలు మృతి చెందాయి. ఈ సంఘటన దిన ధర్మసాగర్ మండలం ఎలుకుర్తి గ్రామ శివారులో గురువారం జరిగింది. బాధితుల కథనం ప్రకారం... ధర్మసాగర్‌కు చెందిన గొర్రెలకాపరులు గంటె రమేష్, గంటె సంపత్, గంటె సాంబరాజు, అల్లాడి పెద్దపురం, గంటె పెద్ద కొంరయ్య, చిన్న కొంరయ్యలకు చెందిన గొర్రెలను మేతకు తోలుకుపోయారు. శాయిపేట్ వైపు నుంచి గొర్రెలను మేపుకొని తిరిగి ధర్మసాగర్‌కు వస్తుండగా ఎలుకుర్తి క్రాస్ వద్దకు రాగానే కారు అతివేగంతో వచ్చి గొర్రెల మందపైకి దూసుకుపోయింది. దీంతో ఏడు గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందగా, మరో తొమ్మిది గొర్రెలకు గాయ్యాలయ్యాయి. కాగా, మృతి చెందిన గొర్రెల విలువ సుమారు రూ.లక్ష వరకు ఉంటుందని బాధితులు తెలిపారు. ప్రమాదానికి కారణమైన నిందితులను గొర్రెలకాపరులు పోలీసులకు అప్పగించారు.

అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య


వస్కుల రాజు(ఫైల్)

మడికొండ, ఏప్రిల్ 4 : అప్పుల బాధతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన కాజీపేట మండలం మడికొండలో చోటుచేసుకుంది. స్థానిక ఎస్సై రాజబాబు తెలిపిన వివరాలప్రకారం. ధర్మసాగర్ మండలం ముప్పారం గ్రామానికి చెందిన వస్కుల రాజు (37)కు మడికొండ ఎస్సీ కాలనీలోని రజితతో పదేళ్ల క్రితం వివాహం జరిగింది. కుటుంబంతో మడికొండలో నివాసముంటున్నాడు. వీరికి ఒక కుమార్తె ఉంది. గతంలో ఆటో నడుపుకునే రాజు కొంతకాలంగా అప్పుల బాధతో ఇబ్బంది పడుతున్నాడు. గతంలో అతను ఒకసారి ఆత్మహత్యాయత్నానికి యత్నించాడు. మంగళవారం రాత్రి ఇంట్లో పడుకున్న అతడు ఉదయం వేళ ఇంట్లో వారు లేచి చూసే సరికి ఇంటి ముందు ఉన్న రేకుల షెడ్డులో ఉరి వేసుకుని కనిపించాడు. అతడిని ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ గురువారం తెల్లవారుజామున మృతి చెందాడు. భార్య రజిత ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.


వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

రైలులో బాలుర తరలింపు

పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించిన పోలీసులు

కాజీపేట, ఏప్రిల్ 4 : రైలులో తరలిస్తున్న బాలకార్మికులను పోలీసులు పట్టుకుని చైల్డ్‌లైన్‌కు అప్పగించారు. కాజీపేట రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ ఎం. సంజీవరావు తెలిపిన ప్రకారం. గోరఖ్‌పూర్-సికింద్రాబాద్ మధ్య నడిచే గోరఖ్‌పూర్ ఎక్స్‌ప్రెస్ రైలులో గురువారం వివిధ ప్రాం తాల నుంచి బాలురను తరలిస్తున్నారన్న సమాచారంతో కాజీపేటలో ఆర్పీఎఫ్, జీఆర్పీ సిబ్బంది తనిఖీలు చేశారు. ఈ తనిఖీల్లో 11 మంది బాలురు, వారిని తరలిస్తున్న ఐదుగురిని పట్టుకున్నారు. విచారించగా వేసవి సెలవులు ఉన్నందున బీహార్, మధ్య ప్రదేశ్, ఉత్తరప్రదేశ్ నుంచి హైదరాబాద్‌లో పని చేయించేందుకు బాలురలను తరలిస్తున్నట్లు రవాణాదారులు ఒప్పుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుకున్న బాలురను చైల్డ్‌లైన్‌కు అప్పగించినట్లు చెప్పారు. తనిఖీలల్లో రైల్వే సీఐ రామ్మూర్తి, సిబ్బంది పాల్గొన్నారు.

మార్కెట్‌కు 5రోజుల వరుస సెలవులు

వరంగల్ వ్యవసాయం, ఏప్రిల్ 4 : వరంగల్ (ఏనుమాముల) వ్యవసాయ మార్కెట్‌కు వరుసగా ఐదు రోజులు సెలవులు ప్రకటించినట్లు ఆ మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి కె.సంగయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం బాబూజగ్జీవన్‌రామ్ జయంతి, శనివారం వారాంతపు సెలవు, ఆదివారం సాధారణ సెలవు, సోమవారం అమావాస్య సందర్భంగా సెలవు, మంగళవారం ఉగాది పండగను పురస్కరించుకుని సెలవు ప్రకటించినట్లు తెలిపారు. బుధవారం నుంచి యథావిధిగా క్రయవిక్రయాలు జరుగుతాయని పేర్కొన్నారు. ఈ విషయాన్ని గమనించి రైతులు, వ్యాపారులు, కార్మికులు మార్కెట్ కమిటీకి సహకరించాలని కార్యదర్శి ఆ ప్రకటనలో కోరారు.

ఫిజికల్ ఎడ్యుకేషన్ పరీక్ష తేదీలు ఖరారు

హనుమకొండ టౌన్ / కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4 : ఎంపీఈడీ, బీపీఈడీ పరీక్ష తేదీలను గురువారం కేయూ పరీక్షల విభాగం ప్రకటించింది. ఈనెల 18, 20, 23, 25 తేదీల లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఎంపీఈడీ మొదటి సెమిస్టర్, ఈనెల 16, 19, 22, 24 తేదీలలో ఎంపీఈడీ థర్డ్ సెమిస్టర్ పరీక్షలు, అదే విధంగా ఈనెల 16, 18, 20, 22 తేదీలలో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు బీపీఈడీ మొదటి సెమిస్టర్ పరీక్షలు నిర్వహించనున్నట్లు కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి రాధిక తెలిపారు.

ముగిసిన ఇంటర్ స్పాట్

వరంగల్ ఎడ్యుకేషన్ మార్చి 4 : ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన ప్రక్రియ గురువారంతో ముగిసింది. మార్చి 16 నుంచి హనుమకొండలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహిస్తున్న స్పాట్ క్యాంపు ముగిసిందని క్యాంపు ఆఫీసర్ ఎ.గోపాల్, అదనపు క్యాంపు అధికారి కె. మాధవరావులు పేర్కొన్నారు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి జనరల్ విభాగంలో 7.5 లక్షల జవాబు పత్రాలు రాగా, వొకేషనల్ విభాగంలో 1.5 లక్షల జవాబు పత్రాలు వచ్చాయి. వీటన్నింటి మూల్యాంకన ప్రక్రియ పూర్తియ్యిందని తెలిపారు. స్పాట్ క్యాంపులో 361 మంది సీఈలు, 1,838 మంది ఏఈలు, 361 మంది స్క్రూటిని సిబ్బంది పాల్గొన్నట్లు వారు తెలిపారు. మూల్యాంకన ప్రక్రియ పూర్తి కావడంతో మరో పది రోజుల్లో బోర్డు మార్కుల పోస్టింగ్‌ను పూర్తి చేసి ఫలితాలు ప్రకటించే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తుంది.

జేఈఈ మెయిన్స్ పరీక్షలు ప్రారంభం

ఈనెల 12వ తేదీ వరకు నిర్వహణ

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జేఈఈ మెయిన్స్ పరీక్ష హనుమకొండ నగరంలో ఏర్పాటు చేసిన మూడు కేంద్రాల్లో ప్రశాంతంగా ప్రారంభమైంది. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు జరిగిన షిఫ్ట్-1 పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 716 మంది హాజరు కాగా 74 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.63 శాతం మంది విద్యార్థులు మొదటి షిఫ్ట్‌లో హాజరయ్యారు. ఇక మధ్యాహ్నం 3 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు జరిగిన రెండవ షిఫ్ట్ పరీక్షకు మొత్తం 790 విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 713 మంది హాజరు కాగా 77 మంది గైర్హాజరయ్యారు. మొత్తంగా 90.25 శాతంమంది విద్యార్థులు మొదటిషిఫ్ట్‌లో హాజరయ్యారు. కాగా నగరంలోని అయాన్ డిజిటల్ జోన్, ఎర్రగట్టు గుట్ట, నోబుల్ టెక్నాలజీస్, చింతగట్టు, వాగ్దేవి ఇంజనీరింగ్ కళాశాల బొల్లికుంటలో గురువారం జేఈఈ మెయిన్స్-2024 పరీక్షలు ప్రారంభమయ్యాయి. నగరంలో ఏర్పాటు చేసిన నాలుగు కేంద్రాల్లో ఈనెల 12 వరకు రెండు షిఫ్టుల్లో జరిగే పరీక్షకు 8,627 మంది పరీక్ష రాయనున్నారు.

భార్యకు దూరంగా ఉంటున్న భర్తపై దాడి

హనుమకొండ టౌన్, ఏప్రిల్ 4 : విడాకుల కేసు కోర్టులో కొనసాగుతోండగానే భార్య కుటుంబసభ్యులు భర్తపై దాడి చేశారు. ఈ ఘటనకు సంబంధించి గురువారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. హనుమకొండలోని రాయపురాకు చెందిన గుండెబోయిన మహేశ్ ఆయన భార్య అపర్ణకు సంబంధించి విడాకుల కేసు గత రెండేళ్ల నుంచి కోర్టులో కొనసాగుతోంది. ఈ క్రమంలో అపర్ణ కుటుంబసభ్యులు మ్యాదరబోయిన రాజేందర్, మ్యాదరబోయిన రాజ్‌కుమార్, రవి ఈనెల 1న రాయపురలోని మహేశ్ ఇంట్లోకి చొరబడి వస్తువులను ధ్వంసం చేయడంతో పాటు మనుషులపై దాడి చేశారు. బాధితుడు బుధవారం ఫిర్యాదు చేయగా నిందితులపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

విద్యార్థులకు వరం.. బీసీ గురుకులం..


ఉమ్మడి వరంగల్ జిల్లాలోని ఎంజేపీ కళాశాలలో విద్యార్థులకు పాఠాన్ని బోధిస్తున్న లెక్చరర్

కేసముద్రం, ఏప్రిల్ 4 : పదో తరగతి పూర్తిచేసి.. ప్రతిభావంతులైన వెనుకబడిన తరగతుల విద్యార్థులకు ఇంటర్ విద్యను అందించేందుకు మహాత్మా జ్యోతిబాపూలే తెలంగాణ బీసీ సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ (ఎంజేపీటీబీసీ డబ్ల్యూ) ఆధ్వర్యంలో నిర్వహించే రెసిడెన్షియల్ జూనియర్ కళాశాలలు వరంగా మారాయి. వెనుకబడిన తరగతుల విద్యార్థుల్లోని ప్రతిభకు వెలికితీస్తూ వారి బంగారు భవిష్యత్‌కు ప్రభుత్వ గురుకుల కళాశాలలు బాటలు వేస్తున్నాయి. పేద, మధ్య తరగతి వర్గాల విద్యార్థులకు ఇంటర్ విద్యతో పాటు ఐఐటీ, ఎంసెట్, నీట్ ప్రవేశపరీక్షల్లో ఆంగ్ల మాధ్యమంలో విద్య నందిస్తూ రాష్ట్రప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా 29 మహాత్మా జ్యోతిబా పూలే బీసీ గురుకుల జూనియర్ కళాశాలలను రాష్ట్రప్రభుత్వం నెలకొల్పింది. వీటిలో 15 బాలురకు, 14 బాలికల కోసం ఏర్పాటు చేశారు. 2024-2025 విద్యా సంవత్సరానికి ఇంటర్ అడ్మిషన్ కోసం నిర్వహించే ప్రవేశ పరీక్షకు పదో తరగతి విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తోంది. ప్రైవేటు కళాశాలలు, హాస్టళ్లలో ఫీజులు చెల్లించలేక ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న తల్లిదండ్రులు తమ పిల్లలను ఈ గురుకులాల్లో చేర్పించేందుకు ఆసక్తి ప్రదర్శిస్తున్నారు. ఇంటర్మీడియట్, ఒకేషనల్ కోర్సుల్లో ఆంగ్లమాధ్యమంలో విద్యతోపాటు ఉచితంగా భోజన, వసతి, ఇతర సౌకర్యాలు కల్పిస్తారు. ప్రవేశపరీక్షలోని మార్కులు, రిజర్వేషన్లను అనుసరిస్తూ సీట్లను భర్తీ చేయనున్నారు.

ఉమ్మడి జిల్లాలో 2,480 సీట్లు

ఉమ్మడి వరంగల్ జిల్లాలో 29 మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల జూనియర్ కళాశాలల్లో 2480 సీట్లున్నాయి. వరంగల్, హన్మకొండ జిల్లాల్లో ఏడు కళాశాలల చొప్పున, మహబూబాబాద్, జనగామ జిల్లాల్లో ఐదు చొప్పున, ములుగు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాల్లో మూడు చొప్పున మొత్తం 29 కళాశాలలున్నాయి. ఈ 29 కళాశాలల్లో 15 బాలురకు, 14 బాలికలకు కేటాయించగా బాలురకు 1,360 సీట్లు, బాలికలకు 1,120 సీట్లు మొత్తం 2,480 సీట్లు ఉన్నాయి. ఈ గురుకులాల్లో బీసీలకు 75 శాతం సీట్లు కేటాయించగా ఎస్సీలకు 15 శాతం, ఎస్టీలకు 5శాతం ఓసీ లేదా ఈ బీసీలకు 2శాతం, అనాథలకు 3 శాతం సీట్లు కేటాయించారు. ఆయా రిజర్వేషన్లలోనే 3శాతం దివ్యాంగులకు, 25 శాతం సీట్లను జ్యోతిబా పూలే బీసీ గురుకులాల్లో, బీసీ సంక్షేమ హాస్టళ్లలో చదివే విద్యార్థులకు కేటాయించారు. ప్రవేశ పరీక్షకు 2024లో పదో తరగతి రెగ్యులర్‌లో పూర్తి చేసిన వారే అర్హులు. గతంలో పాసైన వారు, సప్లమెంటరీ రాసిన వారు ప్రవేశానికి అనర్హులుగా పరిగణిస్తున్నారు.


జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లిలోని జ్యోతిబా పూలే బాలుర గురుకుల పాఠశాల ప్రాంగణం

- ఇంటర్‌లో ఉచిత వసతి, విద్య
- ఐఐటీ, నీట్, ఎంసెట్‌లో శిక్షణ
- 'సూపర్-100' పేరుతో ప్రత్యేక కోచింగ్
- బీసీలకు 75 శాతం సీట్లు రిజర్వు
- ఉమ్మడి జిల్లాలో 29 కళాశాలలు 2,480 సీట్లు
- ప్రవేశ పరీక్ష కోసం 12వ తేదీ వరకు దరఖాస్తుల స్వీకరణ

గురుకుల కళాశాలల ప్రత్యేకతలు, సౌకర్యాలివే..

- కళాశాలల్లో ఉచిత విద్యతోపాటు వసతి, భోజనం
- ఆంగ్ల మాధ్యమంలోనే బోధన
- ప్రతీ తరగతి గదిలో డిజిటల్ క్లాసులు
- విద్యతో పాటు క్రీడలకు ప్రాధాన్యం.
- ఉదయం వ్యాయామంతో ప్రారంభించి 7.30 నుంచి 9గంటల వరకు బోధన కార్యక్రమాలు
- మౌలిక సదుపాయాలు, ప్రయోగశాలలు, గ్రంథాలయాలు, ఆట స్థలాల సౌకర్యం
- ఉచిత బెడ్డింగ్ మెటీరియల్, యూనిఫాం, నోట్ బుక్స్ పాఠ్యపుస్తకాలు
- కాస్మెటిక్ చార్జీల చెల్లింపు
- విద్యార్థులపై 24గంటల పాటు అధ్యాపకుల పర్యవేక్షణ
- ఇంటర్‌తో పాటు ఐఐటీ, నిట్, ఎంసెట్, నీట్‌లో శిక్షణ.
- రాష్ట్రవ్యాప్తంగా ఉన్న గురుకులాల్లో ప్రవేశపరీక్ష ద్వారా ఎంపిక చేసి 'సూపర్-100' బ్యాచ్‌గా ఏర్పాటు చేసి ప్రత్యేకంగా ఐఐటీ, నీట్, ఎంసెట్‌లలో శిక్షణ.

జిల్లాల వారీగా కళాశాలలు..

ఉమ్మడి జిల్లాల్లోని జనగామ జిల్లాలో బచ్చన్నపేటలో బాలికలు, బాలురకు వేర్వేరు గురుకులాలున్నాయి. స్టేషన్‌ఘన్‌పూర్‌లో బాలురు, రఘునాథపల్లిలో బాలికలు, మొండ్రాయిలో బాలికలు, జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో మొగుళ్లపల్లిలో బాలురు, గాంధీనగర్ ఘన్‌పూర్‌లో బాలికలు, భూపాలపల్లిలో బాలురు, ములుగు జిల్లా వెంకటాపురంలో బాలురు, పాకాల కొత్తగూడలో బాలికలు, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో బాలికలు, గుమ్ముడూరులో బాలురు, పెద్దవంగరలో బాలురు, పెద్దగూడూరులో బాలికలు, దంతాలపల్లిలో బాలురు, వరంగల్ జిల్లా నెక్కొండలో బాలికలు, నల్లబెల్లిలో బాలురు, సంగెంలో బాలురు, వరంగల్‌లో బాలికలు, ఖిలా వరంగల్‌లో బాలురు, తిమ్మాపూర్‌లో బాలికలు, వర్ధన్నపేటలో బాలికలు, హన్మకొండ జిల్లా శాయంపేటలో బాలురు, ఆత్మకూరులో బాలికలు, హన్మకొండలో బాలురు, కాజీపేటలో బాలికలు, ఐనవోలులో బాలురు, కమలాపూర్‌లో బాలురు, బాలికలకు వేర్వేరుగా కళాశాలలున్నాయి.



ఎంజేపీ గురుకుల కళాశాల బాగుంది..

- సందిరి రవి, విద్యార్థి తండ్రి, కేసముద్రం స్టేషన్

మహబూబాబాద్‌లోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలలో నా కుమారుడు జగదీశ్వర్ ఇంటర్ సీఈసీ పూర్తి చేశాడు. నాణ్యమైన విద్య, బోధన ఈ కళాశాలలో అందుతాయి. పేద, మధ్య తరగతి వర్గాల తల్లిదండ్రులకు ఈ గురుకుల కళాశాలలు ఒక వరంగా మారాయి. ప్రతీ ఒక్కరు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి.



విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి..

- వై.మనోహర్‌రెడ్డి, ఆర్‌సీవో, ఎంజేపీ గురుకులాల ఉమ్మడి వరంగల్ జిల్లా

వెనుకబడిన తరగతుల విద్యార్థులకు అన్ని సౌకర్యాలతో ఉచిత బోధన కల్పించే ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. గత ఏడాది ఇంటర్ ప్రవేశపరీక్షను ఉమ్మడి జిల్లాలో 6 వేల మంది విద్యార్థులు రాశారు. ఈ గురుకులాల్లో అన్ని అర్హతలు గల లెక్చరర్లతో విద్యాబోధన ఉంటుంది. ఇంటర్‌తో పాటు ఎంసెట్, ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణ ఉటుంది. మెరుగైన విద్యార్థులకు 'సూపర్-100' గ్రూప్‌కు ఎంపిక చేసి సీవోఈ కళాశాలలో ప్రత్యేకంగా ఐఐటీ, నీట్ తదితర ప్రవేశ పరీక్షలకు శిక్షణనిస్తారు.

బాలికను వేధించిన యువకుడి అరెస్టు

శాయంపేట(హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : ప్రేమపేరుతో ఓ బాలికను వేధింపులకు గురిచేసిన యువకుడిపై కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు ఎస్ఐ ప్రమోద్‌కుమార్ తెలిపారు. కొప్పులకు చెందిన పసుల శివరాజ్ ఓ బాలికను నెలరోజులుగా ప్రేమపేరుతో వేధిస్తున్నాడని చెప్పారు. ఈక్రమంలో ఈనెల 2న రాత్రి గ్రామంలో కిరాణంషాపుకు వెళ్తున్న బాలికను వేధించాడు. దీంతో ఆ విషయాన్ని తల్లిదండ్రులకు తెలియజేసింది. ఈ మేరకు పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేయడంతో శివరాజ్‌పై కేసు నమోదు చేశారు. గురువారం నిందితుడిని అరెస్టు చేసినట్లు ఎస్ఐ వివరించారు.

110 ఏళ్ల అమ్మకు అన్నీ తానై..

ఆస్తుల్లేకపోయినా సాకుతున్న వృద్ధురాలు


తల్లితో కూతురు వెంకటమ్మ

నర్సంపేట టౌన్, మార్చి 4 : ఆస్తులు లేవు.. పనులు చేసుకునేందుకు సత్తువ లేదు. ప్రభుత్వం నుంచి వచ్చే వృద్ధాప్య పింఛనే ఆసరాగా నూరేళ్ల వయసుపైబడిన తల్లిని సాకుతోంది 80ఏళ్ల వృద్ధురాలు. ఆరోగ్యం సహకరించకపోయినా, ఓ కన్ను కనిపించకపోయినా కని పెంచిన అమ్మ బాగోగులు చూస్తోంది. ఆస్తులు పంచి ఇచ్చిన తల్లిదండ్రులను కూడా వదిలేస్తున్న వారున్న ప్రస్తుత పరిస్థితుల్లో కష్టాలెన్ని ఎదురైనా తల్లిని కంటికిరెప్పలా కాపాడుకుంటోంది నర్సంపేట మండలం జీజీఆర్ పల్లె గ్రామానికి చెందిన నానబోయిన వెంకటమ్మ. దీనికి సంబంధించిన వివరాలివీ.. జీజీఆర్‌పల్లె గ్రామానికి చెందిన వేల్పుల మలమ్మకు 110 ఏళ్లు. మల్లమ్మ భర్త మల్లయ్య కొన్నేళ్ల క్రితం మృతి చెందాడు. వీరికి ఇద్దరు కూతుర్లు కాగా వారికి వివాహలయ్యాయి. ఓ కూతురును వేరే ఊరు ఇవ్వగా.. వెంటకమ్మను తమ స్వగ్రామంలోనే ఇచ్చారు. అయితే వెంకటమ్మ భర్త కూడా గతంలోనే మృతిచెందడం.. ఆమె ఇద్దరు కుమారులు కూడా వివాహలై వేర్వేరుగా ఉంటుండగా వారి ఆర్థిక పరిస్థితి కూడా అంతంతమాత్రమే. ఈ క్రమంలో ఒంటరిగా ఉన్న వెంకటమ్మ.. 110ఏళ్ల పైబడిన తల్లి మల్లమ్మను ఒంటరిని చేయకుండా తనకున్న గుడిసెలోనే ఉంచి సపర్యలు చేస్తోంది. అయితే వెంకటమ్మ వయసు 80 సంవత్సరాలు కాగా ఆరోగ్యం సహకరించకపోయినా.. ఓ కన్ను సరిగా కనిపించకపోయినా తల్లి ఆలనాపాలనా మాత్రం మరవలేదు. ఉండడానికి పూరిగుడిసె తప్ప ఎలాంటి ఆస్తులు, ఆదాయం లేకపోవడంతో తల్లీకూతుళ్లకు ప్రభుత్వం నుంచి వస్తున్న వృద్ధాప్య పింఛనుతోనే బతుకీడుస్తున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు, దాతలు తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

నేడు బాబు జగ్జీవన్‌రాం జయంతి

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 4: భారత తొలి ఉపప్రధాని బాబు జగ్జీవన్‌రాం 116వ జయంతి వేడుకలను మార్చి5న శుక్రవారం ఉదయం నిర్వహిస్తామని కేయూ ఎస్సీఎస్టీ సెల్ డైరెక్టర్ డాక్టర్ తుమ్మల రాజమణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. దూరవిద్య కేంద్రం వద్ద గల బాబు జగ్జీవన్‌రాం కాంస్య విగ్రహనికి పూలమాలతో నివాళులర్పిస్తాని వెల్లడించారు. అనంతరం కేయూ సెనెట్ హాల్‌లో కంటెపరరీ ఇష్యూష్ ఆఫ్ ఇండియా సొసైటీ అనే అంశంపై జరిగే సదస్సులో మాజీ తెలంగాణ, ఏపీ హైకోర్టు జడ్జీ బి. చంద్రకుమార్ కీలక ప్రసంగం చేస్తారన్నారు.

రేగులగూడెం వాసికి డాక్టరేట్



కాటారం, ఏప్రిల్ 4: భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలోని రేగులగూడెం గ్రామపంచాయతీ పరిధి బూడిదపల్లి గ్రామానికి చెందిన పొన్న మహేష్‌కుమార్ డాక్టరేట్(డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ) పట్టా సాధించారు. కాకినాడ జేఎన్‌టీయూ ద్వారా కంప్యూటర్ సైన్స్ ఆఫ్ ఇంజనీ రింగ్(సీఎస్ఈ) విభాగంలో డాక్టర్ ఫిలాసఫీ అవార్డు పొందారు. 'ఎఫీషియంట్ అప్రోచెస్ ఫర్ డ్రైవింగ్ హై యుటిలిటీస్ ఫ్రం డాటా స్ట్రీమ్స్' అనే సిద్ధాంత వ్యాసాన్ని ఎంవీజీఆర్ ఇంజనీరింగ్ కాలేజీ సీఎస్ఈ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ పి.శ్రీనివాసరావు పర్యవేక్షణలో సమర్పించడంతో మహేష్ కుమార్ పీహెచ్‌డీ సాధించారు.



క్యాంపస్‌లో ఏర్పాటు చేసిన ప్రోషోల ఫ్లెక్సీ


స్ప్రింగ్ స్ప్రీకి ముస్తాబైన నిట్ ప్రధాన గేట్ తోరణం

నేటి నుంచి నిట్‌లో వసంతోత్సవం

- మూడు రోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమాలతో అలరించనున్న 'టెక్నోక్రాట్స్'
- సాయంత్రం ప్రారంభించనున్న డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి
- భావిభారత ఇంజనీర్ల కల్చరల్ ఫెస్ట్‌కు ముస్తాబైన పాంగణం
- హాజరుకానున్న 10 వేలమంది విద్యార్థులు

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : కాజీపేటలోని నిట్ ప్రాంగణంలో సందడి నెలకొననుంది. శుక్రవారం నుంచి మూడు రోజులపాటు 'టెక్నోక్రాట్స్' సాంస్కృతిక కార్యక్రమాలతో విద్యార్థులు దుమ్మురేపనున్నారు. ఈ ఏడాది 'సృజనాత్మకత శక్తితో కూడిన పండుగను వాగ్దానం చేయడం, పాల్గొనే వారి గత పరిమితులను అధిగమించి వారిలో దాగిఉన్న శక్తిని బయటకు తీయడం (ఋఖిఞూఎఞా)' అనే థీమ్‌తో వసంతోత్సవాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దారు. భావిభారత ఇంజనీర్లు సాంస్కృతిక సంబరాల్లో మునిగి తేలనున్నారు. ఈ స్ప్రింగ్‌స్ప్రీలో నిట్‌లోని విద్యార్థులతో పాటు మొత్తం 10 వేలమంది స్టూడెంట్స్ కేరింతలు కొట్టనున్నారు. నేడు సాయంత్రం నిట్ డైరెక్టర్ ప్రొఫెసర్ బిద్యాధర్ సుబుద్ధి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమాన్ని నిట్ స్టూడెంట్స్ డీన్ వెల్ఫేర్ ప్రొఫెసర్ డి.శ్రీనివాసాచార్యులు పర్యవేక్షిస్తున్నారు.

స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమాలు ఇలా..

● మొదటి రోజు

అన్ సాల్వ్‌డ్ నుక్కడ్ నాటకం, నిట్ వరంగల్ గాట్ టాలెంట్, ఫిల్మ్ ట్రెజర్ హంట్, ఫిల్మ్ క్విజ్, కొరియో నైట్, కూచిపూడి నృత్య ప్రదర్శనలు, ఫుడ్ హంట్‌తో పాటు ప్రోషోలో ప్రముఖ గాయకుడు హరిచరణ ఆధ్వర్యంలో చౌరస్తా బ్యాండ్ కార్యక్రమం ఉర్రూతలూగించనుంది.

రెండోరోజు..

నిట్ వరంగల్ సోలో ఐడల్, డైరెక్టర్స్ కట్, ఫిల్మ్‌క్విజ్, హంగ్‌గేమ్స్, ఫొటో పజిల్‌తో పాటు నకాష్ అజీజ్, లాహోర్ ద బ్లాక్ స్మిత్ బృందం ప్రోషోలో విద్యార్థులను తన్మయత్వంలో ముంచనున్నారు.

మూడోరోజు..

జనరల్ క్విజ్, డైరెక్టర్స్ కట్, సీపీఆర్ రిలేతో స్ప్రింగ్ స్ప్రీ కార్యక్రమం ముగియనుంది.

జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో కేజీబీవీ విద్యార్థినికి బంగారు పతకం


స్రవంతిని అభినందిస్తున్న డీఈవో

వరంగల్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జాతీయ సాఫ్ట్‌బాల్ పోటీల్లో బంగారు పథకం సాధించిన వేలేర్ కేజీబీవీ పాఠశాల 9వ తరగతి విద్యార్థిని సీహెచ్. స్రవంతిని డీఈవో అబ్దుల్‌హై అభినందించారు. జీసీడీవో సునిత ఆధ్వర్యంలో బంగారు పతకం సాధించిన స్రవంతిని డీఈవో కార్యాలయంలో డీఈవో అబ్దుల్ హై పుష్పగుచ్ఛం, శాలువాతో సత్కరించారు. కాగా గత నెల 29 నుంచి ఏప్రిల్ 1 వరకు మహారాష్ట్రలోని ఔరంగాబాద్‌లో నిర్వహించిన జాతీయ స్థాయి సబ్ జూనియర్ సాఫ్ట్ బాల్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాలికల జట్టు తరపున పోటీల్లో పాల్గొని అత్యంత ప్రతిభను కనబరిచి బంగారు పతకాన్ని సాధించింది. జీసీడీవో సునిత, పీఈటీ కిరణ్మయి, ఎస్‌వో స్రవంతి, హనుమకొండ సాఫ్ట్‌బాల్ సెక్రెటరి తాబేటి రాజేందర్ తదతరులు స్రవంతిని అభినందించారు.



కాంస్య పతకం, ప్రశంసా పత్రం


సాంబమూర్తి

చిత్రకళలో సాంబమూర్తికి కాంస్య పతకం

కరీమాబాద్, ఏప్రిల్ 4 : రంగ్-23 2వ నేషనల్ వైడ్ ఆర్ట్ అండ్ పెర్ఫామెన్స్ కాంపిటీషన్‌లో ఉర్సు కుమ్మరివాడ ప్రాంతానికి చెందిన ఆవునూరి సాంబమూర్తి కాంస్య పతకం సాధించాడు. ఆజాదికా అమృత్ మహోత్సవ్ వేడుకల సందర్భంగా మినిస్ట్రీ ఆఫ్ కల్చరల్ ఆధ్వర్యంలో ఏక్ భారత్ శ్రేష్ట్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన చిత్రకళ పోటీలను కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ముంబాయిలోని వెర్‌సోవా వెల్ఫేర్ అసోసియేషన్ హైస్కూల్‌లో గత ఫిబ్రవరి 10, 11వ తేదీల్లో నిర్వహించారు. సాంబమూర్తి 'సర్వాంతర్యామి భారత్' అనే సందేశం చిత్రాన్ని పోస్టు ద్వారా కాంపిటీషన్‌కు పంపించాడు. 40నుంచి 60 ఏళ్ల కేటగిరీలో ఆయనకు తృతీయ బహుమతిని లభించింది. నిర్వాహకులు సాంబమూర్తికి సమాచారం అందించి, కాంస్య పతకాన్ని, ప్రశంసా పత్రాన్ని పోస్టుద్వారా పంపించగా గురువారం ఉదయం తనకు చేరినట్లు సాంబమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన్ను పలువురు అభినందించారు.

అక్కంపేటలో తాగునీటికి కటకట

- వారం రోజులుగా ప్రజల ఇబ్బందులు
- వ్యవసాయ బావుల వద్దకు పరుగులు

ఆత్మకూరు (హనుమకొండ జిల్లా), ఏప్రిల్ 4 : మండుతున్న ఎండలకు ప్రజల దాహార్తిని తీర్చాల్సిన అధికారులు పత్తాలేకుండా పోవడంతో నల్లానీరు రాక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని అక్కంపేట గ్రామంలో వారం రోజుల క్రితం మిషన్ భగీరథ పైపులైన్ పగిలిందని గుంతలు తీయించారు. వారం రోజులు గడిచినా మరమ్మతులు చేయకపోవడంతో తాగునీరు లేక ప్రజలు వ్యవసాయ బావులను ఆశ్రయిస్తున్నారు. ఎన్నిసార్లు అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకూడదని ప్రభుత్వం ఎన్నిసార్లు హెచ్చరించినా అధికారుల తీరు మారడం లేదు. పలుమార్లు ఎంపీడీవో దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని వాపోయారు. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి పైపులైన్‌కు మరమ్మతులు చేపట్టి తాగునీరు అందించాలని వేడుకుంటున్నారు. లేని పక్షంలో ఖాళీ బిందెలతో కలెక్టర్ కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు.

పట్టించుకోని అధికారులు..

సర్పంచ్‌ల పదవీకాలం ముగియడంతో ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యతను ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులకు అప్పగించారు. ఈ నేపథ్యంలో అధికారులు పత్తాలేకుండా పోవడంతో నీటి సమస్యను ఎవరు పరిష్కరించాలని గ్రామస్థులు ప్రశ్నిస్తున్నారు. ప్రత్యేక అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడడం లేదని ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్తామని స్థానిక కాంగ్రెస్ నాయకులు తెలిపారు.


మరమ్మతుల కోసం గుంత తవ్వి వదిలిన దృశ్యం

7న మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : జిల్లాలో ఈ నెల 7న మోడల్‌స్కూల్లో ప్రవేశాలకు అర్హత పరీక్ష ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి రామారావు అన్నారు. మహబూబాబాద్‌లో గురువారం చీఫ్ సూపరింటెండెంట్, డిపార్ట్‌మెంట్ అధికారులతో జూమ్ మీటింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ.. జిల్లా వ్యాప్తంగా 10 సెంటర్లలో పరీక్షలు నిర్వహించనున్నట్లు తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు 1343 మంది హాజరుకానున్నారని, వీరికి ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. 7, 8, 9, 10 తరగతి విద్యార్థులకు మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు పరీక్ష ఉంటుందన్నారు. విద్యార్థులు నిర్ణీత పరీక్ష సమయానికి కంటే గంట ముందుగానే పరీక్షకేంద్రాలకు చేరుకోవాలన్నారు. విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు ఎలక్ట్రానిక్, సెల్‌ఫోన్‌లు తీసుకురాకూడదని సూచించారు. ఇతర వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు సెల్ : 98497 61012ను సంప్రదించాలని తెలిపారు.

విద్యార్థులకు యునిఫామ్స్ సిద్ధం చేయాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 4 (ఆంధ్రజ్యోతి) : వచ్చే విద్యాసంవత్సరం ఆరంభం లోపు విద్యార్థులకు యూనిఫామ్స్ సిద్ధం చేయాలని కలెక్టర్ అద్వైత్ కుమార్‌సింగ్ ఆదేశించారు. మహబూబాబాద్ జిల్లా కలెక్టర్ కార్యాలయంలో గురువారం ప్రభుత్వ పాఠశాలల పిల్లలకు యూనిఫామ్ (దుస్తులు) స్టిచ్చింగ్‌పై సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ..ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని కేజీబీవీ, టీఎస్‌మోడల్‌స్కూల్, ప్రభుత్వ పాఠశాల, టీడబ్ల్యూపీఎస్, ప్రైవేట్ ఎయిడెడ్, టీఆర్ఎఈఎస్‌లలో చదువుతున్న విద్యార్థినీ, విద్యార్థులకు యూనిఫామ్ కుట్టించేందుకు ప్రణాళికలు వెంటనే సిద్ధం చేయాలన్నారు. ప్రస్తుత డిమాండ్ అంచనా మేరకు కొలతలు తీసుకుని మ్యాచింగ్ ప్రకారం వచ్చే విద్యా సంవత్సరం లోపు యూనిఫామ్ అందించేందుకు పక్కాప్రణాళికతో సంబంధిత శాఖల అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఇందుకోసం 1563 మంది డీఆర్‌డీఏ, స్వయం సహాయక బృందాల సభ్యులు ముందుకు వచ్చారని వారి ద్వారా ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 47,453 మంది విద్యార్థులకు రెండు జతల చొప్పున 94906 జతల యూనిఫామ్స్ కుట్టించడం జరుగుతుందన్నారు. ఈ సమావేశంలో జిల్లాఅదనపుకలెక్టర్లు లెనిన్‌వత్సల్‌టొప్పో, ఎం.డేవిడ్, జిల్లా అధికారులు రామారావు, నర్సింహస్వామి, బాలరాజు, ఎర్రయ్య, శ్రీనివాస్, జయశ్రీ, మెప్మా డీఎంసీ విజయ, నళిని, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్

జీపీ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభం

కేసముద్రం, ఏప్రిల్ 4 : వేసవిలో ప్రజల దాహార్తిని తీర్చేందుకు కేసముద్రం స్టేషన్ మేజర్ గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో అంబేద్కర్ సెంటర్‌లో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం తహసీల్దార్, ప్రత్యేకాధికారి తాళ్లూరి దామోదర్ ప్రారంభించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి చుక్కల అశోక్‌కుమార్, మడుపు కృష్ణమూర్తి, వైద్యసిబ్బంది, ఆశవర్కర్లు, జీపీ సిబ్బంది పాల్గొన్నారు.

7న హైదరాబాద్‌లో పుట్టగొడుగుల పెంపకంపై సదస్సు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 4 :రైతునేస్తం ఫౌండేషన్ ఆధ్వర్యంలో, కర్షక్ సేవా కేంద్రం నిర్వహణలో ఈ నెల 7న హైదరాబాద్ ఖైరతాబాద్‌లోని రైతునేస్తం కార్యాలయం ఆవరణ, దక్షిణభారత హిందీ ప్రచార సభ కాంప్లెక్స్‌లో పుట్టగొడుగుల పెంపకంపై అవగాహన సదస్సు జరుగుతుందని రైతునేస్తం ఫౌండేషన్ ఛైర్మన్, పద్మశ్రీ పురస్కార గ్రహీత యడ్లపల్లి వేంకటేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రెండు రాష్ట్రాల నుంచి రైతులు తరలి వస్తున్నారని ముందుగా రిజిస్టర్ చేసుకున్న 30 మంది రైతులకే అవకాశం ఉంటుందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లా నుంచి ఆసక్తిగల రైతులు పాల్గొనాలని కోరారు. రిజిస్ట్రేషన్ చేసుకోవడానికి, ఇతర వివరాలకు సెల్ : 95538 25532, 70939 73999 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

పదో తరగతి విద్యార్థులకు ప్రవేశ పరీక్ష

తొర్రూరు, ఏప్రిల్ 4 : పదో తరగతిలో జీపీఏ సాధించేందుకు 9వ తరగతి పూర్తి చేసిన విద్యార్థులకు వందేమాతరం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 6వ తేదీన ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు తొర్రూరు డివిజన్ కేంద్రంలోని వందేమాతరం ఫౌండేషన్ నిర్వాహకుడు రవీంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉమ్మడి వరంగల్ జిల్లాతో పాటు రాష్ట్రంలోని 10జిల్లాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివే విద్యార్థులకు ప్రవేశ పరీక్ష నిర్వహించి, నెల రోజుల పాటు ఉచిత బస, భోజనంతో కూడిన శిక్షణ అందిస్తామన్నారు. ఈ నెల 23 నుంచి విద్యార్థులకు శిక్షణ తరగతులు ఉంటాయని, మరిన్ని వివరాలకు 9177148158, 9704190459 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి

తొర్రూరు, ఏప్రిల్ 4 : వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ వరంగల్ అభ్యర్థి ఆరూరి రమేష్ విజయానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేవైఎం నియోజకవర్గ కన్వీనర్ శ్రావణ్ అన్నారు. గురువారం తొర్రూరులో బీజేపీ వరంగల్ ఎంపీ అభ్యర్థి ఆరూరి రమేష్ జన్మదిన సందర్భంగా కేక్ కట్ చేసి ఆయన మాట్లాడుతూ ప్రధాని మోదీ పేద ప్రజల సంక్షేమానికి ప్రవేశపెడుతున్న పథకాలే మరోమారు మోదీని గెలిపిస్తాయన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఆరూరి రమేష్ ఎన్నిక ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. క్షేత్రస్థాయిలో కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలన్నారు. సంపత్, రాజేష్, నవీన్, గణేష్, సుమన్, సంతోష్, శివ, విషు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తోనే రాష్ట్రంలో సుపరిపాలన

- ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్



సమావేశంలో మాట్లాడుతున్న డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్

డోర్నకల్, ఏప్రిల్ 4 : రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ ద్వారానే సుపరిపాలన కొనసాగుతుందని డోర్నకల్ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ జాటోతు రాంచంద్రునాయక్ అన్నారు. డోర్నకల్‌లో బుధవారం ఏర్పాటు చేసిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ అన్ని వర్గాలకు న్యాయం చేసే పార్టీ అని చెప్పారు. కాంగ్రెస్‌పార్టీ ద్వారనే సంక్షేమ పథకాలు ప్రతి పేదవారికి అందుతాయని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతోందని తెలిపారు. ప్రతీ ఒక్కరికి లబ్ధిదారుడికి పథకాలు అందుతాయని తెలిపారు. ఈ సందర్భంగా డోర్నకల్ మునిసిపల్ చైర్మన్ వాంకుడోతు వీరన్న, వైస్ చైర్మన్ కేశబోయిన కోటిలింగం, వార్డు కౌన్సిలర్లు బసిక అశోక్‌తో పాటు మరికొందరు బీఆర్ఎస్ పార్టీకి రాజీనామా చేసి ఎమ్మెల్యే సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. వారందరికి పార్టీ కండువాలు కప్పి ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సమావేశంలో డోర్నకల్ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు సుమీర్‌చంద్‌జైన్, మాద శ్రీనివాస్, తాళ్లూరి హనుమ, భాగం శేషయ్య, సాహెబ్ హుస్సేన్, నున్సావత్ భద్రునాయక్, గొల్లచర్ల ఎంపీటీసీ శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

రాంపూర్‌లో కంఠమహేశ్వర ఆలయ ప్రతిష్ఠాపన

మరిపెడ రూరల్ : మండలంలోని రాంపూర్‌లో నూతనంగా నిర్మించిన కంఠమహేశ్వర దేవాలయాన్ని ప్రభుత్వ విప్ డోర్నకల్ ఎమ్మెల్యే జాటోతు రామచంద్రునాయక్ ప్రారంభించారు. గురువారం కంఠమహేశ్వర విగ్రహాన్ని ప్రతిష్ఠకు హాజరై మాట్లాడారు. శుక్రవారం జలబిందెలు, శనివారం బోనాలు, ఆదివారం జంతుబలులు నిర్వహిస్తారని గౌడ కులస్థులు తెలిపారు. మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ పండుగను అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకుంటామని వారు తెలిపారు. ఈ సందర్భంగా పెద్ద ఎత్తున భక్తులు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షుడు పెంగ్లీ రఘువీరారెడ్డి, ఈరగాని రమేష్, దోమల సత్యశ్రీనివాస్, వీరాంజి తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠ

- వేడుకల్లో పాల్గొన్న సుధీర్‌రెడ్డి, రాధిక దంపతులు

గూడూరు, ఏప్రిల్ 4 : గూడూరు మండలం మదనాపురంలో దివంగత లింగాల పద్మ-వెంకట్‌రెడ్డి దంపతుల కుమారుడు-కోడలు, స్పెషల్ క్లాస్ కాంట్రాక్టర్, ఎల్ఎస్ఆర్ ఇంజనీరింగ్ ప్రైవేట్ లిమిటెడ్ వ్యవస్థాపకులు లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు స్వస్తిశ్రీ శుభాకృత్ గురుఫాల్గుణ బహుళ దశమి, శ్రావణం గురువారం రోజున శ్రీ వేంకటేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠత, ధ్వజస్తంభాన్ని స్థాపించారు. రూ.120 కోట్లతో నిర్మించిన శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయంలో 1 నుంచి 6 వరకు పూజా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. గురువారం శాన్తిపాకం, యాగశాలలో మూర్తికుం భారాధన, చదుర్వేదవి న్నపం, మన్త్రమూర్తి మన్త్రహోమములు, ప్రయాచిత్త హోమము, ద్వారతోరణబలి, మహాపూర్ణాహుతి, శ్రీలక్ష్మి గోదాసమేత శ్రీవేంకటేశ్వర స్వామి వారి దివ్యవిగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం, మహాకుంభ సంప్రో చన ప్రథమ ఆరాధన, దుష్టికుంభం, శాన్తీకల్యాణం లాంటి కార్యక్రమాలను అర్చకులు ముడుంబై లక్ష్మినారాయణాచార్యులు, శ్రీమన్ ఉత్పల కృష్ణచైతన్యచార్యులు, గొడవర్తి శ్రావణ్ కుమార్ చార్యులు మంత్రోచ్చరణల నడుమ పూజాకార్య క్రమాలు నిర్వహిం చారు. విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ ఎంపీ అజ్మీర సీతారాం నాయక్, టీపీసీసీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్నం శ్రీకాంత్‌రెడ్డి, గూడూరు సొసైటీ చైర్మన్ చల్లా లింగారెడ్డి, సనాతన శివాలయం చైర్మన్ ఏపూరు రవీందర్‌రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు బీరవెల్లి భరత్‌కుమార్‌రెడ్డి, జిల్లా నాయకులు వేణుగోపాల్‌రెడ్డి, మాజీ సర్పంచులు రణదీర్‌రెడ్డి, తులసిరాం నాయక్, లింగాల యాదవరెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు రాచకొండ కొమురయ్య, జిల్లా ఉపాధ్యక్షులు మేరెడ్డి సురేందర్ హాజరయ్యారు.



పూజా కార్యక్రమంలో పాల్గొన్న లింగాల సుధీర్‌రెడ్డి-రాధిక దంపతులు

నేడు చిన్నజీయర్‌స్వామి రాక..

మదనాపురంలో శ్రీ లక్ష్మిగోదా శ్రీవేంకటేశ్వరస్వామి నూతన దేవాలయ విమానగోపుర, ధ్వజ, శిఖర మహోత్సవా నికి శ్రీశ్రీశ్రీ త్రిదండి చిన్న శ్రీమాన్నారాయాణ రామనుజ జీయర్ స్వామి వస్తున్నట్లు ఆలయ నిర్మాణకర్త లింగాల సుధీర్‌రెడ్డి తెలిపారు.

రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలి

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 4 : రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తొర్రూరు ఏపీఎం సంజీవరావు తెలిపారు. మండలంలోని ఫత్తేపురం గ్రామంలో గురువారం ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సుధాకర్, ఏఈవో భరత్‌చంద్ర, సీసీ పద్మావతి, సీఏలు యమున, సంధ్య, నిర్వహకులు సంధ్య, రజిత, అరుణ, లక్ష్మీనర్సమ్మ పాల్గొన్నారు.

- పెద్దవంగర : కొనుగోలు కేంద్రాల వద్దకు రైతులు నాణ్యమైన ధాన్యాన్ని తీసుకువచ్చి మద్దతు ధరను పొందాలని ఏపీఎం రమణాచారి అన్నారు. గురువారం మండలంలోని పోచంపల్లిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఏఈవో యశస్విని, సీసీలు పద్మ, సుధాకర్, సిబ్బంది అనిల్, భద్రమ్మ, శోభ, సోమన్న తదితరులు పాల్గొన్నారు.
- డోర్నకల్ : మధ్య దళారుల మాటలు నమ్మి మోసపోకుండ రైతులు తాము పండించిన ధాన్యం ప్రభుత్వం ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించి మద్దతు ధరపొందాలని సెర్ప్ డోర్నకల్ ఏపీఎం శంకర్‌నాయక్ అన్నారు. బుధవారం మండలంలోని వెన్నారం, బంజరలలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ... రైతులు కొనుగోలు కేంద్రాలను వినియోగించుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ సమైక్య అధ్యక్షురాలు చంద్రకళ, సుభద్ర, సెర్ప్ సిబ్బంది పాల్గొన్నారు.



పెద్ద వంగరలో కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏపీఎం

బీజేపీ మండల అధ్యక్షుడిగా నరేష్‌యాదవ్

బయ్యారం, ఏప్రిల్ 4 : బయ్యారం మండల బీజేపీ అధ్యక్షుడిగా ఉప్పల పాడుకు చెందిన రాసాల నరేష్‌యాదవ్‌ను నియమించినట్లు పార్టీ జిల్లా అధ్యక్షుడు యలమంచిలి వెంకటేశ్వర్‌రావు తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ పార్టీ కార్యాలయంలో గురువారం నియామక పత్రాన్ని నరేష్‌యాదవ్‌కు అందజేశారు. ఈ సందర్భంగా నరేష్‌యాదవ్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో మండల పార్టీ బాధ్యతలు అప్పగించిన జిల్లా అధ్యక్షుడికి ధన్యవాదాలు తెలిపారు. మండలంలో పార్టీ అభివృద్ధికి కృషి చేసి రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో అభ్యర్థి సీతారాంనాయక్ విజయానికి కార్యకర్తలు అందరూ సమిష్టిగా పనిచేయాలని అన్నారు. కార్యక్రమ ంలో పార్టీ నాయకులు నంబూరి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



నరేష్‌యాదవ్‌కు నియామక పత్రాన్ని ఇస్తున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రావు

కోరం లేక కురవి మండల సభ వాయిదా

కురవి, ఏప్రిల్ 4 : కోరం లేక గురువారం జరగాల్సిన కురవి మండల సభ వాయిదా పడింది. కోరం ఉండాలంటే తొమ్మిది మంది ఎంపీటీసీ సభ్యులు హాజరు కావాల్సి ఉండగా కేవలం ఐదుగురు మాత్రమే హాజరయ్యారు. దీనికి తోడు ఎటువంటి తీర్మాణాలు చేయకుండ ఎన్నికల కోడ్ ఉండడంతో మండల సభను వాయిదా వేస్తున్నట్లు ఎంపీడీవో వీరబాబు పేర్కొన్నారు. దీంతో మండల సభకు వచ్చిన ప్రజాప్రతినిధులు, అధికారులు, గ్రామ కార్యదర్శులు వెనుదిరిగారు.

వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : వెనుకబడిన వర్గాల అభ్యున్నతికి కృషి చేసిన మహనీయుడు జగ్జీవన్‌రామ్ అని ప్రిన్సిపాల్ రాజు అన్నారు. మహబూబాబాద్‌లోని నూకల రాంచం ద్రారెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో గురువారం డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ జయంతిని పురస్కరించుకొని ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళ్లర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..స్వాతం త్ర్య సమరయోధుడు, సంఘ సంస్కర్త, రాజకీయవేత్త, ఉపప్రధానిగా దేశానికి విశిష్ట సేవలందించారని పేర్కొన్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతీ ఒక్కరు కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు వెంకటేశ్వర్లు, రామారత్నమాల, మమత, యుగందర్, వేణుగోపాల్, బొంద్యాలు, మల్లేషం, ఖాసీం, రాజేందర్, సుజిత్‌రెడ్డి, రామ్‌రెడ్డి, నరహరి, శశికాంత్, హతిరాం, సుమలత, సంతోష్‌రెడ్డి, సంతోష్‌కుమార్, వీరు తదితరులు పాల్గొన్నారు.

సమయం పాటించని వార్డెన్‌పై చర్యలు తీసుకోవాలి

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 4 : విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తూ సమయపాలన పాటించని వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా కన్వీనర్ పట్ల మధు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం మహబూబాబాద్ బీసీ సంక్షేమశాఖ కార్యాలయంలో జిల్లా బీసీ సంక్షేమశాఖ అధికారి నరసింహస్వామికి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ..హాస్టళ్లలో విద్యార్థులకు అందుబాటులో ఉండాల్సిన హాస్టల్ వార్డెన్లు సమయ పాలన పాటించకుండా తమ ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని పేర్కొన్నారు. చాలా మంది వార్డెన్లు దూరప్రాంతాల వచ్చి విధులు నిర్వహించటం వలన విద్యార్థులు హాస్టల్ సిబ్బందిపైనే ఆధారపడాల్సి వస్తుందన్నారు. హాస్టళ్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న వార్డెన్లపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ గందసిరి జ్యోతిబసు, రాజేష్, వరుణ్, వినయ్ పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి రాకుండా చర్యలు

జిల్లా పంచాయతీ అధికారి హరిప్రసాద్

గార్ల ఎప్రిల్ 4 :వేసవి కాలంలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి రాకుండా నివారణ చర్యలు తీసుకుంటామని జిల్లా పంచాయితీ అధికారి హరిప్రసాద్ అన్నారు. మండలంలోని మర్రిగూడెం, సరిహద్దుతండా, పిక్లీతండా, బుద్ధారం గ్రామాల్లో గురువారం తాగునీటి పథకాల పనితీరు ప్రజలకు అందుతున్న మీషన్ భగీరధ నీటి సరఫరా వివరాను ఎఈ అడిగి తెలుసుకున్నారు. ఎండకాంలో నీటి ఎద్దడి నివారణకు ప్రైవేటు బావులను సైతం వాడకంలో తీసుకోవాలన్నారు. ఈకార్యక్రమంలో ఈఈ, కృష్ణారెడ్డి, ఎంపీడీవో మంగమ్మ, ఎంపీవో రజిని, ఎఈ వసుందర,పంచాయతీ కార్యదర్శి కిశోర్ చక్రదర్ నాయక్ పాల్గొన్నారు.



సిబ్బందికి సూచనలు చేస్తున్న అధికారి హరిప్రసాద్

రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలను తిప్పికొట్టాలి

- మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్
- జిల్లాకు చేరిన భారత రాజ్యాంగ రక్షణ యాత్ర

నెహ్రూసెంటర్, ఏప్రిల్ 4 :కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం మరోసారి అధికారంలోకి వస్తే భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలు చేస్తోందని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షులు పిల్లి సుధాకర్ ఆరోపించారు. ఏప్రిల్ 2న ప్రారంభమైన భారత రాజ్యాంగ రక్షణ యాత్ర గురువారం మానుకోట జిల్లాకు చేరుకుంది. ఈ సందర్భంగా పిల్లి సుధాకర్ మాట్లాడుతూ.. బీజేపీ మతోన్మాద రాజకీయాలను ప్రేరేపిస్తూ భారత రాజ్యాంగాన్ని మార్చాలనే కుట్రలు చేస్తుందని ఆరోపించారు. అంబేద్కర్ స్ఫూర్తితో ప్రశ్నించే గొంతులను అణిచివేస్తుందన్నారు. రాజ్యాంగం మౌళిక సూత్రమైన లౌకికవాదంను అపహాస్యం చేస్తుందని, 400 సీట్లు వస్తే రాజ్యాంగాన్నిమారుస్తామనే వరకు తెగించారన్నారు. ఏప్రిల్ 8న హైదరాబాద్‌లో భారత రాజ్యాంగ రక్షణ యాత్ర ముగింపు ఉంటుందన్నారు. ఈ ముగింపు బహిరంగ సభకు దళిత, గిరిజనులు, భారత రాజ్యాంగ అభిమానులు భారీగా తరలి రావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కొండ బాబు, రమేష్, బాబురావు, దార సత్యం, అశోద భాస్కర్, సత్యనారాయణ, నర్సింగరావు, శ్రీరాములు, వెంకటస్వామి, సుధాకర్, రవికాంత్, నీరుటి రాములు పా ల్గొన్నారు. కాగా, భారత రాజ్యాంగ రక్షణ యాత్రకు ఎమ్మార్పీఎస్ జాతీ య కార్యదర్శి గుగ్గిళ్ల పీరయ్య, పీవైఎల్ జిల్లా అధ్యక్షులు సామ పాపయ్య, ఎమ్మెస్పీ నాయకులు ఎండి.యాకూబ్‌పాషాలు సంఘీభావం తెలిపారు.

- నెల్లికుదురు : రాజ్యాంగాన్ని మార్చాలని చేస్తే సహించేది లేదని జాతీయ మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పిల్లి సుధాకర్ తెలిపారు. రాజ్యాంగ రక్షణ యాత్ర గురువారం నెల్లికుదురుకు చేరుకుంది. మాలమహానాడు నాయకులు అంబేద్కర్ విగ్రహానికి పూల మాలవేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగాన్ని కాపాడు కోవడం కోసం ప్రతి ఒక్కరు తరలిరావాలన్నారు.ఈ కార్యక్రమంలో జాతీయ మాలమహానాడు మండల అధ్యక్షుడు కారం ప్రశాంత్, జాతీయ కార్యదర్శి అశోద భాస్కర్, ఉపాధ్యక్షుడు వన్నె బాబురావు, పురుషోత్తం, సుందర్‌రావు, రమణమూర్తి, సుందర్‌రావు, సమ్మయ్య, వెన్న రాజు పాల్గొన్నారు.



నెల్లికుదురులో మాట్లాడుతున్న పిల్లి సుధాకర్

- తొర్రూరు : రాజ్యాంగాన్ని రక్షించుకునేందుకు ప్రతి ఒక్కరూ పోరాడాలని మాలమహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ అన్నారు. రాజ్యాంగ రక్షణ కోసం తెలంగాణ వ్యాప్తంగా మాలమహానాడు జాతీయ అధ్యక్షుడు అద్దంకి దయాకర్ నేతృత్వంలో చేపట్టిన యాత్ర గురువారం డివిజన్ కేంద్రానికి చేరుకుంది. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళి అర్పించి మాట్లాడారు. దేశంలో 400ఎంపీ స్థానాలు గెలిస్తే రాజ్యాంగాన్ని మారుస్తామన్న పాలకులకు బుద్ధి చెప్పి రాజ్యాంగాన్ని రక్షించుకోవా లని పిలుపునిచ్చారు. దేశంలో జరుగుతున్న పాసిస్టు విధానాన్ని వ్యతిరేకించాలని, రాజ్యాంగాన్ని మారుస్తామన్న నాయకులకు బుద్ధి చెపుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నగేష్, అనిల్, సమ్మయ్య, లింగయ్య, మహేష్, నవీన్, శ్రీనివాస్, అంజయ్య, ప్రశాంత్, సంజీవ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య లేకుండా చర్యలు చేపట్టాలి

మరిపెడ రూరల్, ఏప్రిల్ 4 : మండలంలోని గిరిపురం, వెంకంపాడు, చిల్లంచర్ల గ్రామాల్లో తాగునీటి సమస్య లేకుండా పరిష్కరించాలని జిల్లా వెటర్నరీ ఆఫీసర్ డాక్టర్ సుధాకర్ పంచాయతీ కార్యదర్శులు, స్పెషల్ ఆఫీసర్లను ఆదేశించారు. గురువారం ఆయా గ్రామాల్లో ఎంపీడీవో రేవతితో కలిసి పర్యటించారు. వేసవి కాలంలో ప్రజలకు తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. అలాగే చిల్లంచర్లలో నీటిని వృథా చేస్తున్న గాడుదల రామ్మూర్తి, కొలిచెలమ సతీష్‌లను మందలించారు. నీటిని వృథా చేసినట్లయితే నీటి కనెక్షన్ తొలగిస్తామని హెచ్చరించారు.

పెద్దవంగర, ఏప్రిల్ 4: వేసవి కాలం దృష్ట్యా గ్రామాల్లో నీటి ఎద్దడి లేకుండా చూడాలని, అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ఎస్.వెంకటేశ్వర్లు ఆదేశించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో అధికారులు, పంచాయతీ కార్యదర్శుల సమావేశం ఏర్పాటుచేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని గ్రామాల్లో మిషన్ భగీరథ ద్వారా సురక్షిత తాగునీటిని సరాఫరా చేసి తాగునీరు ఎద్దడి లేకుండా సమన్వయంతో పనిచేయాలన్నారు. ఎంపీడీవో మేణుమాధవ్, ఎంపీవో సత్యనారాయణ, ఏఈలు యాకుబ్, దయాకర్, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

గడ్డివాములు దగ్ధం

చిన్నగూడూరు, ఏప్రిల్ 4 : చిన్నగూడూరు గ్రామానికి చెందిన ఇద్దరు రైతుల గడ్డివాములు గురువారం అగ్నికి ఆహుతయ్యాయి. బాధిత రైతులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకార ం సంపత్ అనే రైతుకు చెందిన 150మోపు లు, బోల్లు యాకన్నకు చెందిన 70మోపుల గడ్డి కాలిపోయింది. ఇద్దరి రైతుల గడ్డివా ములు సుమారు రూ.30 వేల విలువ ఉంటుందని బాధిత రైతులు తెలిపారు.

కాంగ్రెస్ గెలుపుతోనే మేలు

మరిపెడ, ఏప్రిల్ 4 : కాంగ్రెస్ గెలుపుతోనే సంచార జాతుల కుటుంబాలకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని టీపీసీసీ, ఓబీసీ రాష్ట్ర జాయింట్ కో ఆర్డినేటర్ పింజ్రాల రాందాసు అన్నారు. గురువారం మరిపెడ మునిసిపల్ కేంద్రంలోని మందుల బజార్లో సంచార జాతుల కుల సంఘాల సమావేశం జరుగగా ఆయన హాజరై మాట్లాడారు. రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో మానుకోట కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి పోరిక బలరాంనాయక్‌ను గెలిపించాలని పిలుపునిచ్చారు. గంగులు, సాయి, పెంద్ర శాంతమ్మ, ఉప్పలయ్య, రవి, చిన్నోడు, వెంకన్న పాల్గొన్నారు.

ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

గార్ల, ఎప్రిల్ 4 :భారత రాజ్యాంగంలో పొందుపర్చిన ఓటు హక్కును ఓటు హక్కును ప్రతీ ఒక్కరు సద్వినియోగం చేసుకొని ప్రజాస్వామ్య వ్యవస్థను పటిష్ఠ పర్చాలని గార్ల బయ్యారం సీఐ బి.రవి కుమార్ అన్నారు. గురువారం గార్ల మండలం ఎర్రమట్టి తండాలో ఓటు హక్కు వినియోగంపై పోలీస్ శాఖ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్సై నిమ్మతోట జీనత్ కుమార్, పోలీస్ గ్రామ మాజీ సర్పంచ్ రాంబాయి పోలీస్ సిబ్బంది గ్రామ పెద్దలు హరి నాయక్, రమేష్ నాయక్ పాల్గొన్నారు.

ఎక్కడి చెత్త అక్కడే...

తొర్రూరు, ఏప్రిల్ 4 : తొర్రూరు మునిసిపాలిటీ పరిధిలో ఎక్కడి చెత్త అక్కడే ఉన్నా అధికారులు అటువైపు కన్నెత్తి చూడడం లేదు. సిబ్బంది పట్టిం చుకోవడం లేదు. పట్టణం లోని మునిసిపాలిటీకి ఉన్న డంపింగ్ యార్డు(సంగడి బోడు) వద్ద ప్రహరీ నిర్మాణం చేపట్టాలని నిధులు మంజూరు చేసినా పనులు ప్రారంభించలేదు. పక్కనే ఉన్న తండావాసులు చెత్త తగలబడుతుండటంతో దుర్వాసన భరించలేక మునిసిపల్ చెత్త ట్రాక్టర్లను అక్కడికి రాకుండా అడ్డుకున్నారు. దీంతో పట్టణంలోని సోషల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ వెనక భాగంలో ఉన్న బావిలో మునిసిపల్ సిబ్బంది చెత్త వేస్తుండటంతో రిక్షాకాలనీ, గురుకుల పాఠశాలల విద్యార్థులు, పక్కనే ఉన్న కోర్టు భవనం, జడ్జి నివాసం వరకు దుర్వాసన వస్తుండడంతో అనారోగ్య పాలవుతున్నారు. అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని ప్రజలు వాపోతున్నారు. దీనిపై మునిసిపల్ అధికారులను వివరణ కోరగా ఫోన్‌లో అందుబాటులోకి రాలేదు.



హాస్టల్ సమీపంలో సిబ్బంది వేసిన చెత్త